# 37. చెప్పడానికి నోరు రాక...

అన్య రాష్ట్రంలోని ఆ ఆఫీసులో బిక్కు బిక్కు మంటూ ఒక్కణ్ణే పనిచేస్తున్నాను. మరో తెలుగువాడు బదిలీ అయివస్తే నా కంటె సంతోషించేవాడెవడు! వాడే చిన్ననాటి స్నేహితుడైతే అంతకన్న కోరుకో దగ్గది ఏముంటుంది! కాని, ఆ ఆనందంతో పాటు చిన్న జంకు లాటిది తప్పదని మూర్తితో ఓ నెల్లాళ్ళ మార్నింగ్ వాక్‌కి వెళ్లడంతో స్పష్టంగా తెలిసిపోయింది. ఎన్నేళ్లయినా వాడి ధోరణి మారలేదు! ఏ ప్రాంతం వాళ్ళతో అయినా కలిసిపోడం మంచిదే, వాళ్లని సంస్కరిద్దామనే వెర్రి ప్రయత్నం దేనికి? ఆ రోజు మేం నడుస్తూంటే జవాబు చెప్పేడు:

"దేనికా? నేనూ మనిషినే గనుక! సాటి మనిషి మూర్ఖత్వం భరించలేకపోతున్నాను గనక..... మన వాళ్లూ ఉన్నారు గాని, ఛ, మరీ ఇంత వెనకబడిన తనమా?" నేనూ ఊరుకోలేదు.

"దేన్లో బాబూ మన తెలుగువాళ్ల ప్రయోజకత్వం, ఇంత మంది చిల్లర దేవుళ్లు యింకే రాష్ట్రంలోనూలేరనా, ఇంతటి సినీక్రేజు దేశంలో మరోచోట లేదనా, ఇక్కడున్నన్ని బార్లు ఇంకెక్కడా లేవనా, లేపోతే పగటి వేషగాళ్లకి పెద్దపీట వెయ్యడంలో మనదే యింటర్నేషనల్ ఫేమ్ అనా? నూరేళ్లకిందటే చెప్పాడు మన యుగకర్త, 'మన వాళ్లు వొట్టి వెధవాయలోయ్!' అని గురజాడ పాపం ఎక్కడ నొచ్చుకుంటాడో అని మొహమాటపడి, ఎప్పటికీ అలాగే వుండాలని నిశ్చయించుకున్నారు, అదేనా మన ఆంధ్రుల ప్రగతి?"

"ఈ మాట మన రాజధానిలో ఏ రవీంద్ర భారతి స్టేజి మీదో అను, మరినీ ఎడ్రసు దొరకదు!"

"ఆ మాట ఒప్పుకున్నావుగద.... లోపాయికారిగా ఎన్నైనా అనుకుంటాం. మన రాష్ట్రానికి మనం పనికిరాకపొట్టచేత్తో పట్టుకుని ఇంత దూరం వచ్చాం. చల్లగా ఇళ్లకి చేరక వీళ్ళని రెచ్చగొట్టడం ఎందుకు? ఎవరి నమ్మకాలు వాళ్లవి. మన పూజగదుల్లో మన ఆడవాళ్లు అడ్డమైన దేవుళ్ల పటాలూ చేరుస్తున్నారు, అడ్డు కుంటున్నామా! నలుగురికీ ఓ శాల్యూట్ కొట్టేస్తే కనీసం శపించకుండా వుంటారని, అంతేగాని, గుండు గాడొకడూ, గిరజాల వాడొకడూ వీళ్లందరిమీదా అమితమైన భక్తి శ్రద్ధలు అల్లుకున్నాయనే? గడుసుగా బతుకు. మనవాళ్ల లోపాలు నిజమని తెలిసినా, ఊరంత ఉలు కొచ్చిందే నీకు, వీళ్ల మెతుకులు తింటూ వీళ్ల లోపాలు వెతకడం మనకేం క్షేమకరం?"

రోటరీ బోర్డు వచ్చేసింది. మా మార్నింగ్ వాక్‌కి అదే చివరిమెట్టు. అక్కణ్ణుంచి వెనక్కితిరిగి వచ్చిన దారే పడతాం. మా కాళ్లే కాదు, నోళ్లుకూడా అలా పని చేస్తూనే వుంటాయి. చురుకైన వాడవడం చేత మా మూర్తి ఏదో రోజు వెళ్లమార్చడం కోసం కాక ఆ హిందీ బెంగాలీ కలగలుపు ఇడియమ్ కూడా నిమిషాల మీద పట్టేశాడు. అదిగో ఆ చురుకుదనమే, ఆ అక్కర్లేని వాటిలో కలుగజేసుకోడమే, వాడికి ముప్పు తెచ్చేలా వుంది, ఆ మాట ఎన్నివిధాల చెప్పినా, మొండి వెధవ, వినిచావడే!

ప్రతీ ఉదయం కలిసివెళ్లినా, కలిసి తిరిగొచ్చినా, చిత్రమేమిటంటే మా ఇద్దరివీ ఎవరిదార్లు వాళ్లవే!

'ఆ హరిచరణ్ గంగూలీ నీ సంగతి అటో ఇటో తేల్చేస్తానని నలుగురిదగ్గిరా అంటున్నాడని విన్నాను. నా మాట విను, వాడి జోలికి వెళ్లకు.' అని ఆ రోజు వందోసారి వాడిని హెచ్చరించాను.

"ఏమిటి తేల్చేది, వాడి మొహం! ఈ లోగా వాడి సంగతేదో నేను తేల్చేయకపోతేకదా! అమాయకుల్ని మోసం చేసి ఎన్నాళ్లని డబ్బు చేసుకుంటాడు, వాణ్ణా నేను వదిలేది?"

అని ఆరోజు వెయ్యోసారి, వాడు నా మాట ధిక్కరించాడు.

గంగూలీ, మేమిద్దరం పనిచేసే వెల్‌ఫేర్ ఆఫీసులో హెడ్‌క్లర్క్. కీలక స్థానంలో వున్నాడు గనక పబ్లిక్ వెల్‌ఫేర్‌కి ఫేర్‌వెల్ పబ్లిగ్గా చెప్పి, లభించేదేదో లాభించేలా చేసుకుని, ఇప్పటికేదో 'చావా బతక్కుండా' ఓ రెండిళ్లూ ఏభై ఎకరాల పొలం మాత్రమే సంపాదించాడు! ప్రభుత్వం అంటే ప్రజాసేవయే గదా! అందుకని కుర్చీలో కూచున్న కూసింత సేపైనా ఆఫీసు పని ముట్టుకో నేరవడాయన. ప్రశ్న చెప్పించుకోడానికో మంత్రం వేయించుకోడానికో ముందే వచ్చి అతనికోసం ఆఫీసు వరండా నిండిపోతారు ఆ కొండ ప్రజ. ఏనాడూ పన్నెండు లోగా రాడు గంగూలీ సీటుమీదకి. ఇదేమని ఏనాడూ అడిగే ధైర్యం లేదు పెద్ద ఆఫీసరుకైనా. అంతకు ముందు ఆఫీసరు ఇలాగే అడిగితే పదిరోజులపాటు పక్క వదల్లేదుట! నిత్య పూజా దురంధరుడూ, హనుమాన్ ఉపాసకుడూ, మంత్ర జ్యోతిష్‌శాస్త్రాలలో ఆరితేరిన వాడూ అని గంగూలీకి పేరు. పట్టెడు జుత్తూ, రూపాయి కాసంత బొట్టూ ఎర్రటి కళ్ళూ ఎప్పుడూ ఏదో మైకంలో వున్నట్టు వుంటాడు. ముహూర్తం పెట్టించుకోడానికో చెయ్యి చూపించుకోడానికో సరాసరి ఆఫీసుకే వచ్చేస్తుంటారు, ఎక్కడెక్కడి జనం. అందరికీ అన్నీ చెప్పి, వారిచ్చిన డబ్బు తనకూడా తెచ్చే సీలువేసిన పెట్టెలో 'హనుమదార్పణం' అంటూ పడేస్తుంటాడు.

'ఈ డబ్బు పెట్టె ఇంటికి తీసికెడుతున్నారు మీరు, హనుమదర్పాణం ఎలా అయింది?' అని తొలి రోజుల్లోనే గంగూలీని నిలదీసి ఆయన ఆగ్రహానికి గురి అయ్యాడు మూర్తి. అయితే, గంగూలీ పైకి తేలే రకం కాదు. ఒక్క నిమిషం ఆగి ఎదురు ప్రశ్న వేశాడు.

'ఏం పిచ్చి ప్రశ్న బాబూ ఇది, మహాభక్తులు ఉద్భవించిన దక్షిణ హిందూ ప్రాంతం నుంచి వచ్చావని విన్నాను. నీకూ సందేహనివృత్తి కాలేదా? ఆ రామబంటు ఒక్కడే స్థిరమూ, శాశ్వతమున్నూ, ఆ పరమాత్మ ఒక్కడే నిజం. మనమందరం నీడలం కాదా! ఏదైనా వారి పేరునే కదా!"

మా వాడింకా తేరుకోకుండానే యింకో సంగతి చెప్పేడు:

'నీలాంటి అమాయకుల కోసమే నాయనా విగ్రహాలూ, దేవాలయాలూ! అందరికీ ఆత్మ సాక్షాత్కారం కాదుకదా అందుకే ఈ ఆలంబనలు! ఈ విధంగా కూడబెట్టిన సొమ్మంతా అక్షరాలా ఆంజనేయ సేవకోసమే! హనుమంతుడి పేర ఓ గుడి కట్టించడానికే!"

' అవునవును, అలా కొల్లగొట్టిన సొమ్ములో కొట్టేసిన, కమిషన్‌తోనే కదా, కలకత్తాలో ఈ

మధ్య పెళ్లాం పేర తమరు ప్లాటు కొన్నది" అనే విషయం ఆరా తీసిన మూర్తి నా చెవిలో ఊదేడు. అప్పట్నుంచీ నేను మొత్తుకుంటూనే వున్నాను, వాడి జోలికి వెళ్లకురా, ప్రమాదం అని......

ఇవన్నీకాక గంగూలీ బతుకు నిజంగా బంగారం చేసే ప్రత్యేక విషయం వేరే వుంది. రైల్వే లైనయినా లేని ఆ మారుమూల కొండ ప్రాంతంలో ఎవరికి ఏఆపద వాటిల్లినా, ఎవరో ప్రత్యర్థులు చేతబడి చేయించి వుంటారని దృఢవిశ్వాసం. దానికి విరుగుడు మంత్రం తెలిసిన వాడు ఆ చుట్టుపట్ల గంగూలీ ఒక్కడే. ఈ క్షుద్ర విద్యలో సంపాదించిన సొమ్ము మాత్రం హనుమత్ కైంకర్యం చేసి అపవిత్రం చెయ్యజాలనని బహిరంగం గానే చెబుతున్నాడు, గంగూలీ. ఈ సంగతి నమ్మకంగా తెలిసిన నాటినుంచి మరీ పేట్రేగిపోయాడు మూర్తి. ఈ మధ్య మా వాడు ఉద్యోగం చెయ్యడానికి ఆఫీసుకు రావడంలేదు. ఇది వరకు ఉద్యోగం చెయ్యడానికే ఆఫీసుకి వెళ్లే వాడని అనుకునేవాణ్ణి. ఇప్పుడు తెలుస్తోంది మనిషికి అంతకన్నా ముఖ్యమైన డ్యూటీ ఒకటి వుందని. వీడి మోసం బట్టబయలు చెయ్యందే నేనక్కణ్ణుంచి కదలను అని ఆ రోజు మార్నింగ్‌వాక్‌లో గాయత్రి పట్టుకుని వాడు ప్రమాణం చేస్తున్న తీరు చూస్తే, వాదించడం దేవుడెరుగు ఇలాంటి వాడితో కలిసి తిరగడమే ప్రమాదమనిపించింది నాకు! నా మాట విని ఎవరో రక్షించినట్టు నేను క్వార్టరు చేరే సరికి పసుపురాసిన కవరొకటి నాకోసం ఎదురు చూస్తోంది. ఈ సారి నాకు మగపిల్లాడుట. శాంతీ, బారసాలా వుందిట. వాళ్ళకి వేరే ఆహ్వానం పంపేమనీ, మా ఊరు వెళ్లి అమ్మానాన్నని తీసుకుని వెంటనే రమ్మనీ, మామగారి నుంచి పిలుపు. శలవు కోసం ఆఫీసుకి పరిగెడితే అయిదు దాటిపోయింది, ఎవరూ లేరు. ఎప్పట్లా పదిమంది మధ్య పరివేష్టించి హరిచరణ్ గంగూలీ వున్నాడు. నా చేతిలో పసుపు కవరు చూసి విషయం గ్రహించి అభినందనలు చెబుతూ ఇలా అన్నాడు.

"మూర్తీబాయ్‌లా నాస్తికుడివికాదు, అందుకే నువ్వంటే ఇష్టం నాకు. నేను బాస్‌తో చెబితే కాదనడు. పది రోజులు శలవు పెట్టి వెళ్ళు. పెద్దలు చెప్పినట్టు అన్ని పనులూ నిష్ఠగా చేసుకుని రా. దగ్గిరా, దాపా? వచ్చేటప్పుడు ఫామిలీని తీసుకురా. అన్నట్టు ఈ వీభూతి నీ కొడుక్కి పెట్టు. ఈ కుంకుమ తల్లికీ, భార్యకీ ఇయ్యి. మీ ఫేమిలీ శ్రేయస్సుకోసం ప్రత్యేకించి జపాలు చేయిస్తాను. నీకు కాబట్టి నూటపదహారు రూపాయిల్లో తేల్చేస్తాను. ఇప్పుడివ్వక్కర్లేదులే వచ్చేనెల జీతం నుంచి ఆ సొమ్ము కట్‌చేసి నాకిమ్మని బాస్‌తో మాట్లాడుతాను. వెళ్లు వెళ్లు ఇంకా ఆలస్యం చేస్తే ఆఖరి బస్సుకూడా అందదు. జై వీరహనుమాన్!"

ఆ మాటకంటే వేరే మంత్రం వుందా అనిపించింది ఆ క్షణాన నాకు. నే తిరిగి వచ్చిన రెండుమూడు రోజుల దాకా నాకు పసిపిల్లలకి పాలు వాడుక పెట్టుకోడానికే సరిపోయింది. నాలుగోరోజు మూర్తి ఇంటికి వెడితే ఇంత తాళం! అంతే కాదు, భార్యా పిల్లలతో వాడా ఊర్నుంచే ఉడాయించినట్టు తెలిసి ఆఫీసుకి పరిగెత్తి ఓ క్లర్కుని కదిపాను. నిమిషాల మీద ట్రాన్స్ఫరు చేయించుకు వెళ్లిపోయినట్టు తెలిసింది. నేను మతిపోయి ట్రాన్స్పడిపోతే గంగూలీ భుజం తడుతూ అన్నదిదీ:

"హనుమంతుడి దగ్గిరా కుప్పిగంతులు! చెబితే మీ, మూర్తి విన్నాడా! ఇప్పుడేమయిందో

చూడు. తన భక్తుల్ని ఎలా రక్షించుకోవాలో ఆ స్వామికి తెలుసు అయినా మీ ఫ్రెండు ప్రాణాలతో బయటపడగలిగాడంటే హనుమాన్జీ ఎంత కృపామయుడు!"

ఏం జరిగిందో నేను అడగలేదు. భయాందోళనలతో గిలగిల కొట్టుకుపోయాను. వద్దురా దౌర్భాగ్యుడా అంటే విన్నాడుకాదు. మంత్రశక్తి అలా వుంచి గంగూలీ, స్థాన బలిమి ఉన్నవాడు. వాడి సంగతి తెలిసికూడా ఆఫీసు అంతా తలవంచుకు కాలక్షేపం చేస్తున్నారు. ఎక్కడ్నుంచో వచ్చిన వెధవ తిన్నగా వుండి చావకూడదూ? వాణ్ణి ఆ గంగూలీ వీడి ఏకీలుకాకీలు ఏం ఊడదీయించాడో.......ఎవర్ని అడగను! ఏం చెబుతారో అడిగితే..... రెండు వారాలకి కాబోలు ఉత్తరం వచ్చింది. పీకపోయినా వాడికి ఉత్తరం అలవాటు లేదు, అంత బద్ధకం..... అదైనా వంకరటింకర అక్షరాలు..... హడలిపోతూ చదివాను....... అందులో ముఖ్య విషయం యిదీ:

నువ్వెళ్లాక, చెప్పుకునేవాడు కూడా లేక, బొత్తిగా తోచలేదు. ఏమైతే అయింది, డైరక్ట్గా వాడింటికి వెళ్లి నిలదీస్తేగాని నిలబడలేకపోయింది నా ప్రాణి. ఓ సాయంకాలం వెళ్లి వెయిట్ చేశాను. ఆఖరి పార్టీ వెళ్లిపోయేసరికి పదకొండు దాటింది.

"మీ ధైర్యానికి జోహారు. ఈ వేళప్పుడు నా మనుషులచేత ఏ పాడునూతిలో తోయించినా అడిగే వాడుండడు. ఆ సంగతి తెలిసికూడా వచ్చారు!" అంటూ టీ టిఫినూ పెట్టి ఆదరించాడు. నా ఛాలెంజ్ మానలేదు 'ఇవన్నీ ఎందుకు ఒక్క మాయచేసి చూపించు' అన్నాను.

"మాయ అంటూ వుంటే కదా! ఇవన్నీ ఆలోచించడానికి ఇష్టపడని అమాయకుల ఇంద్రియజాలాలమీద కదా మా ఇంద్రజాలాలు! నువ్వూ నాలాగే సైన్సు గ్రాడ్యుయేట్వని నాకు తెలుసు. నీ ముందు నా మంత్రాలు పారవు. ఇదంతా కేవలం బూటకం. ఒప్పుకుంటున్నాను. నా దారికి అడ్డురాకు. నువ్వేం చెయ్యలేవు సరిగదా పూర్తిగా నష్టపోతావు. వెర్రి ప్రజ మూఢ విశ్వాసం అతి శక్తిమంతమైనది. దాని ముందు ఎలాంటి నైతికశక్తీ పనిచెయ్యలేదు."

వాడి మాటలు వింటూ కూచోడానికి నేను వెళ్లలేదు. అసత్యం సాగుతూంటే ఊరుకునే సంఘద్రోహిని కానని స్పష్టం చేశాను. వాడి వేషాలూ మోసాలూ పది మందికీ చెప్పి పేపరుకి ఎక్కిస్తానన్నాడు. అలా ఆవేశంతో గట్టిగా అరుస్తూంటే ఎడం దవడ అదిరింది. దాన్తో దంతం కదిలింది. దాని పక్కనున్న పుప్పిపన్ను ఆ మధ్యే తీయించేశాను. ఇప్పుడది కదిలి తీవ్ర బాధ కలిగింది. హఠాత్తుగా ఆగిపోయాను. ఏమిటని అడిగితే చెప్పాను.

"విశ్వాసంతో సర్దుకోని అదరిపాటు వుండదు. ఆంజనేయ సిందూరం యిస్తాను, నుదుట పెట్టుకో! మంత్రించిన మహాభస్మం యిస్తాను, పంటి సందున నొక్కుకో, నెమ్మదిస్తుంది."

ఆ అవహేళన చూసి వేడి పెనం మీద చన్నీళ్ళు జల్లినట్టు చిటపటలాడిపోయాను. మరో కప్పు చాయ్ యిచ్చి శాంతింపచేశాడు.

"ఎంత మనోభృతి లేకపోతే ఇంత రాత్రి నాలాంటి వాడి యింటికొస్తావ్? సాటి ఫ్రెండునని సరదాకి ఏదో జోక్ చేశాను. సారీ...... పోనీ మరోటి ట్రై చేసి చూస్తావా? దాన్తో యిలాంటి పంటినొప్పికే

నాకు గొప్ప రిలీఫ్ ఇచ్చింది. నువ్వెలాగా రోజూ మార్నింగ్ వాక్‌కి వెడతావటగా! చాలా మంచి అలవాటు. ఆ బ్రహ్మ ముహూర్తపు గాలిలో ఓజోన్ ఎక్కువ. వీలైనంత దూరం వెళ్లి మరింత గాలి పీల్చు, తూర్పు దిశ వ్యాధినిరోధక గుణం కలిగి వుంటుంది. ఆ చోటుకి అటూ ఇటూ వేపచెట్లు కదా........ ఆ దిశలో ఏదో ఓ వేపచెట్టు ఎంచుకుని అయిదో ఆరో ముదురు ఆకులు కోసుకో నమిలి ఆ ముద్ద పుప్పికీ మంచి పంటికీ మధ్య ఖాళీలో వుంచి ఆ రసం పీల్చుకుంటూ ఇంటికి రా" వేపముద్ద చేదు భరించగలిగితే పంటినొప్పి, చేత్తో తీసికట్టు తగ్గిస్తుందని నేనెక్కడో ఇదివరకే చదివిన గుర్తు." వాడెంత దోపిడీదారు అయినా మంచికోరి చెబితే ఎందుకు కాదు అనిపించింది.

'ఎలాగా రోజూ అంతదూరం వెడుతున్నావు గనక మరోచోట గుర్తుపెట్టుకో. నీకు నమ్మకం వుంటేనే సుమా! ఇలా చేసి యిల్లు చేరితే యిక పంటినొప్పి అనేది వుండదు.'

వాడి మాటల్లో వ్యంగ్యం అనుభవం మీద తప్ప అర్థం కాలేదు నాకు. అలా చేశాక పంటినొప్పి అనేది ఎరగను! నోట్లో పన్ను అనేది మిగిలితేకదా! వెనక్కి తిరిగి ఇప్పుడాలోచిస్తే వాడిలా వేసి వుండాలి అనిపిస్తోంది. నా మీద దాడిచేసిన వాళ్లలో చాలామంది మనం వెళ్లే దారిలో చూసిన మొహాలే. మనం మార్నింగ్ వాక్ వెళ్లే త్రోవలో చిన్న కుగ్రామం లాంటిది వుంది. గుర్తుందీ? ఆ ఊరి పెద్దల్ని పిలిపించి ముందుగా గంగూలీ ఇలా బోధపరిచివుండాలి.

"ఈ మధ్య మీ గ్రామం నుంచి వచ్చే ఎవరో పనిపిల్ల ఉన్నట్టుండి చూపూ మాటా లేకుండా పడిపోయిందని, చెప్పేరు గుర్తుందా? నేనూ రక్షించలేకపోయాను. అంత శక్తిమంతమైన బాణామతి ప్రయోగం. దక్షిణదేశపు చిల్లంగి అది. మూర్తి అనే మా ఆఫీసువాడొకడు ఇప్పుడిప్పుడే ఆ క్షుద్రవిద్యని నేర్చుకుని, మారుమూల పసిపిల్లలమీద పని చేస్తుందో లేదో ప్రయోగించి చూస్తున్నాడని విన్నాను. మార్నింగ్ వాక్ మిషతో బయలుదేరేవారు వీళ్లు. ఏ మాత్రం వెలుగు రాకుండా చూసుకుని తూర్పుదిశని మంత్రం ఉచ్చరిస్తారు వీళ్లు. అమ్మవారికి చిహ్నంగా వేప ఆకులు నోటిలో ధరిస్తారు. ఎన్ని ఆకులు కోసుకుని నోట్లో పెట్టుకుని మంత్రం చదువుతారో అన్ని సంవత్సరాల పిల్లని ఇక ఏ ఉపాసకుడూ రక్షించలేడు. ఇదంతా కేవలం నేను విన్నదే. మీ మటుకు మీరే కనిపెట్టుకు చూడండి. అతన్ని అనుసరించి ఏం చేస్తాడో చూడండి. వేపాకులు నోట్లో పెట్టుకునే దాకా ఆగండి. మంత్రోచ్చారణకి దంతాలు ముఖ్యం. అని లేకుండా చేస్తే చాలు. ఇంకే ఆపదా రానివ్వకండి. ఇది సత్యం. శాస్త్రం ప్రామాణికం."

అంతే, వేప ఆకులు అలా నోట్లో వేసుకున్నాక మూతిమీద పడ్డ దెబ్బలకీ, కారిన నెత్తురికీ, ప్రాణం పోతుందనే అనుకున్నాను. వారం రోజులకి తప్ప ఆస్పత్రిలో తెలివేరాలేదు! ఇదైనా అతి కష్టంమీద రాశాను, నీకో సంగతి చెప్పాలనిపించింది.

నేను పారిపోవడం అనేది గంగూలీకి జడిసికాదు సుమా! చేసిన పనికి సిగ్గుపడి నీ మొహం చూడలేక! పల్లెజనం మూర్ఖత్వం సహజమే, గంగూలీ చెప్పింది అక్షరాలా ఆచరించి గోతిలోకి దిగిన "నన్నేమనుకోవాలి?"

★